సాక్షి చిత్తూరు

శనివారం । 7 । డిసెంబర్ । 2024

పంచమి తీర్థానికి పోటెత్తిన భక్త జనం (ఇన్‌సెట్) చక్రస్నానంలో వేదపండితులు



పులకితం.. పునీతం





న్యూస్‌రీల్

కాణిపాకం ఈవోగా పెంచల కిషోర్



కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన ఈవోగా పెంచల కిషోర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ముందుగా వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మణికంఠేశ్వరస్వామి, వరదరాజుల స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయనను వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం ఏఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పథంలో నడిపించేలా పనిచేద్దామన్నారు. భక్తులకు సమస్యలు వస్తే తక్షణం స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు.

నేడు జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ కార్యాలయంలో శనివారం స్థాయి సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. 1, 7, 2, 4 సంఘాలకు చెందిన ఆర్థిక, ప్రణాళిక, పనులు, విద్య, వైద్యం అంశాలను జెడ్పీ చైర్మన్ చాంబర్‌లో 3, 5, 6 సంఘాలైన వ్యవసాయ, మహిళ, సాంఘిక సంక్షేమం సీఈఓ కార్యాలయంలో ఒకే సమయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో రావాలని వివరించారు.

సర్వేకు సహకరించండి



శ్రీనివాస్‌యాదవ్

చిత్తూరు కార్పొరేషన్: ఎంఎస్ఎంఈ (సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల) నమోదు కోసం చేస్తున్న సర్వేకు వ్యాపారులు సహకరించాలని పరిశ్రమలశాఖ డీఐఓ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. పరిశ్రమల శాఖ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఉత్పత్తి, సేవ, ట్రేడ్, చిరు వ్యాపారులు సచివాలయాల్లో తమ వివరాలను తెలపాలన్నారు. ఆధార్, పాన్‌కార్డు, యూనిట్ ఫొటోలను అక్కడ అందజేయాలని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 3,255 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని వివరించారు. పరిశ్రమల సంఖ్య తెలుసుకుని అభివృద్ధికి సహకారం ఇవ్వడానికి ఈ సర్వే దోహదపడుతుందన్నారు. ఫిబ్రవరి 1 వరకు సచివాలయాల్లో వివరాలు ఇవ్వవచ్చని కోరారు.

సర్వాలంకారశోభితంగా విలసిల్లే పద్మావతీదేవిని కాంచిన కనులదే కదా భాగ్యము.. మహిమాన్వితమైన పద్మసరోవరంలో పుణ్యస్నానమాచరించిన వారి జన్మము కదా ధన్యము.. పంచమి తీర్థంలో శ్రీమహాలక్ష్మి కరుణా కటాక్ష వీక్షణము పొందిన వారి జీవితము కదా చరితార్థము.. స్నపన తిరుమంజన సేవలో సేదతీరే సిరులతల్లికి భక్తిప్రపత్తులతో ప్రణమిల్లిన వారి గమనమే కదా శుభకరము.. కార్తీక బ్రహ్మోత్సవ వేళ అలమేలు మంగమ్మ దర్శనమే కదా సకల పాప హరణము.. దివ్యతేజస్సుతో అలరారుతున్న శ్రీవారి దేవేరి కృపకు పాత్రులు కావడమే కదా మోక్ష మార్గము.



- వైభవంగా పద్మావతీ అమ్మవారి పంచమి తీర్థం
- పద్మసరోవరానికి పోటెత్తిన భక్త జనం
- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవ సంబరం
- నేడు పుష్పయాగానికి సర్వం సిద్ధం

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం పద్మసరోవరం(పుష్కరిణి)లో పంచమి తీర్థం(చక్రస్నానం) వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర స్వామివారు స్వయంగా తన కుంతాయుధంతో తవ్విన పద్మసరోవరంలో కార్తీక మాసం, శుక్లపక్ష పంచమి తిథి, ఉత్తరాషాఢ నక్షత్రం, శుక్రవారం రోజున స్వర్ణకమలంలో శ్రీమహాలక్ష్మిదేవి ఆవిర్భవించినట్లు పురాణ ప్రతీతి. అమ్మవారు ఆవిర్భవించిన పద్మసరోవరంలో ఏటా కార్తీక మాసంలో నిర్వహించే పంచమితీర్థం రోజున స్నానమాచరిస్తే సకల పాపాలు తొలగి, కోటిజన్మల పుణ్యఫలం చేకూరుతుందని భక్తుల విశ్వాసం.



అమ్మవారికి శ్రీవారి సారె తీసుకొస్తున్న జీయర్‌స్వాములు

శాస్త్రోక్తంగా తిరుమంజనం

పంచమితీర్థం సందర్భంగా అమ్మవారిని వేకువజామున 3గంటలకు సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. 7గంటలకు వేడుకగా పల్లకి ఉత్సవం నిర్వహించారు. 8గంటలకు సన్నిధి ముఖ మండపంలో చూర్ణాభిషేకం, ఆస్థానం జరిపించారు. అమ్మవారు, చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలోని పంచమి తీర్థం మండపానికి వేంచేపు చేశారు. జీయర్‌స్వాముల సమక్షంలో అర్చకులు నేత్రపర్వంగా అమ్మవారు, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సమయంలో పుట్టిన రోజు కానుకగా శ్రీవారు పంపించిన రూ.1.11కోట్ల విలువైన పాండ్యన్ కిరీటం, లక్ష్మీపతకం, వజ్ర కరకంఠా భరణాలు అమ్మవారికి అలంకరించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో 12.15 గంటలకు శాస్త్రోక్తంగా చక్రస్నానం జరిపించారు. ఈ క్రమంలోనే పెద్దసంఖ్యలో భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ శ్యామలరావు, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, ఎమ్మెల్యే పులివర్తి నాని, సీవీఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ ఈఓలు గోవిందరాజన్, లోకనాథం, ఏఈఓ దేవరాజులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం

అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు టీటీడీ ఈఓ శ్యామల రావు తెలిపారు. పంచమి తీర్థం సందర్భంగా లక్షలాది మంది భక్తులు పుష్కరిణిలో పవిత్ర స్నానం చేశారన్నారు.

దేవేరికి శ్రీవారి సారె

తిరుమల : పవిత్ర పంచమీతీర్థం రోజున పద్మావతి అమ్మవారికి సంప్రదాయం ప్రకారం తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. ఈ మేరకు ముందుగా శ్రీవారి ఆలయంలో వేకువనే 2.30 నుంచి పరిమళ ద్రవ్యాలతో విమాన ప్రాకారంలో ఊరేగింపు చేపట్టారు. భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఏనుగు అంబారీపై సారెను పురవీధుల్లో ఊరేగిస్తూ కోమలమ్మ సత్రం, కోదండరామస్వామి ఆలయం, గోవిందరాజస్వామి ఆలయం మీదుగా తిరుచానూరులోని పసుపు మండపానికి తీసుకువచ్చారు. స్నపన తిరుమంజనం సేవ నిమిత్తం అర్చకులకు అప్పగించారు.

ధ్వజావరోహణంతో పరిపూర్ణం

అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ధ్వజావరోహణంతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా సాయంత్రం గంగుండ్ర మండపం నుంచి పద్మావతీదేవిని ఊరేగింపుగా ఆలయానికి వేంచేపు చేశారు. రాత్రి 8గంటలకు తిరుచ్చిపై కొలువుదీర్చి తిరువీధులలో ఊరేగించారు. రాత్రి 9.30గంటలకు పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా ధ్వజస్తంభంపై ఉన్న గజ చిత్రపటాన్ని అవరోహణం చేయడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

నేడు పుష్పయాగం

శ్రీవారి దేవేరికి శనివారం సాయంత్రం పుష్పాంజలి చతుర్వేద విన్నపముల(పుష్పయాగం) సేవ నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు పుష్పయాగం జరిపించడం ఆనవాయితీ. తెలిసీ తెలియక చేసిన దోష పరిహారార్థం ఈ పుష్పయాగం చేస్తారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రెడ్డెప్ప

పుంగనూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం పెద్దిరెడ్డి పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాంగ పదవులు ఇచ్చి వారిని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీల మనుగడ ప్రశ్నార్థకమైందని, అధికార ప్రభుత్వం బడుగులకు చేసింది ఏమీలేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, పీకేఎం ఉడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, కౌన్సిలర్లు అమ్ము, పూలత్యాగరాజు, కిజర్‌ఖాన్, రేష్మ, సాజిదాబేగం, భారతి పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూతో రాజకీయాలా?

కలియుగ దైవమైన శ్రీవారి లడ్డూతోనే రాజకీయం చేసిన ఘనుడు చంద్రబాబు అని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దుయ్యబట్టారు. ఆయన అంబేడ్కర్‌కు నివాళులర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి, అధికారంలోకి రాగానే మాటలు మార్చడంలో చంద్రబాబు దిట్ట అని ఎద్దేవా చేశారు. అమలు చేయని హామీలపై నిలదీసే వారిపైన, సోషియల్ మీడియా యాక్టివిస్టులపైన తప్పుడు కేసులు పెట్టి, జైల్లో పెడుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధంపై డీజీపీని స్వయంగా హెలికాప్టర్‌లో పంపి, తనపై అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఆరు నెలలు గడుస్తున్నా వాటిపై ఏం పురోగతి సాధించారని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అతి తక్కువ ధరకే విద్యుత్‌ను కొనుగోలు చేసి, సరఫరా చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా చేసుకోని విధంగా రూ.2.49కు యూనిట్ సెకీ నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. దీనిని చంద్రబాబు అతి తెలివిగా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

సమానత్వం అంబేడ్కరిజంతోనే సాధ్యం

– మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి

కార్వేటినగరం: దేశంలో సమానత్వం అంబేడ్కరిజంతోనే సాధ్యమవుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. తమ నివాసంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆత్మబలంతో జీవించాలన్నదే అంబేడ్కర్ ఆశయమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం, న్యాయం సమానంగా అందాలన్నదే బాబాసాహెబ్ ఆలోచన అని చెప్పారు. అంబేడ్కర్ ఆశయాలను తూ.చ తప్పకుండా పాటిస్తూ దళితుల అభివృద్ధికి ఎనలేని కృషి చేసి, విజయవాడ నడి బొడ్డులో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న చంద్రబాబుకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడుతున్నాయని చెప్పారు.

మన బిడ్డ.. మన బాధ్యత

బడి విద్యాలయం.. గుడి దేవాలయం.. బడి, గుడి లేని పల్లె లేదు. మన బడి మన పిల్లల భవిష్యత్తు నిర్దేశిస్తుంది. అలాంటి ఆలయంలో ఉన్న మన పిల్లలు విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సత్సంబంధాలతో బాధ్యతాయుతమైన పాత్ర నిర్వహిస్తేనే బలోపేతమవుతుంది. స్కూలుకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు గౌరవంగా మెలగడం, వారి సూచనలకు ప్రాధాన్యత ఇవ్వడం తదితర చర్యలతో చిన్నారుల విద్యాభివృద్ధి వారిని భాగస్వాములను చేయవచ్చు. అందుకే శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. దీనిపై ప్రత్యేక కథనం.

- ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పీటీఎం నేడు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖాధికారులు
- తల్లిదండ్రుల సమక్షంలో నివేదికలు
- పాఠశాలల్లో స్నేహపూర్వక వాతావరణానికి చర్యలు

జిల్లా సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	చదువుతున్న విద్యార్థులు
ప్రాథమిక	1,908	65,576
ప్రాథమికోన్నత	206	46,796
ఉన్నత	330	32,128
మొత్తం	2,444	1,44,500

చిత్తూరు కలెక్టరేట్ : 'పిల్లలు ఏం చదువుతున్నారు...? ఎలా చదువుతున్నారు..? ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారు..? ఎన్ని మార్కులొస్తున్నాయో..?.' ఇలాంటి సందేహాలు ప్రతి తల్లి, తండ్రిని తొలిచేస్తుంటాయి. ఆ విషయాలు తెలియాలంటే... విద్యార్థుల చదువు, ప్రతిభ గురించి తెలియజేసే ప్రోగ్రెస్ కార్డులు ఉండాల్సిందే. ఆ మాట ఇన్నాళ్లూ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే వినిపించేది. ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ప్రోగ్రెస్ కార్డు కనిపించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ప్రోగ్రెస్ కార్డు అందనుంది. హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్ట్ పేరుతో విద్యార్థులకు అందించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 7వ తేదీన 'మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్' పేరుతో కార్యక్రమం చేపట్టనున్నారు.

జిల్లాకు చేరిన హోలిస్టిక్ కార్డులు

జిల్లాలో 2,444 స్కూళ్లలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి స్కూలును ముస్తాబు చేసి వేడుకగా చేయాలని క్షేత్ర స్థాయి హెచ్ఎంలకు ఆదేశించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.42 లక్షల నిధులు విడుదల చేసింది. దీంతో సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు జిల్లా లోని 32 మండలాల ఎంఈఓలకు ఆ నిధులు విడుదల చేశారు. అన్ని స్కూళ్లలో వేడుక నిర్వహణకు డీవైఈఓ, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు ముమ్మరం గా చేపడుతున్నారు.

1.44 లక్షల మందికి ప్రోగ్రెస్ కార్డులు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నారు. 2,444 స్కూళ్లలో 1.44 లక్షల మందికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నారు. ఈ నెల 7వ తేదీ నిర్వహించే కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులను అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి, తరగతి గదుల్లో వారిని కూర్చోబెట్టి వారి పిల్లలు స్కూలులో చదువుతున్న తీరు, వారికి వచ్చిన మార్కులు, విద్యార్థుల ప్రతిభపై హోలిస్టిక్ కార్డుల రూపంలో వివరించనున్నారు.



జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల


ముఖ్య సూచనలివిలా..

- వార్డు సభ్యుల నుంచి పార్లమెంటు సభ్యుల వరకూ, సర్పంచ్ నుంచి ముఖ్యమంత్రి వరకూ ప్రజాప్రతినిధులు అందరూ రాజకీయాలకతీతంగా విధిగా పాల్గొనాలి.
- సమావేశపు అజెండాను అనుసరించి జరిగే కార్యక్రమానికి సహకరించాలని కోరారు.
- విద్యారంగం గురించి మాత్రమే ప్రసంగించేలా సూచించారు.
- స్వీయ క్రమశిక్షణ పాటించడంతో మీ నాయకత్వ లక్షణాలు విద్యార్థులు ఆదర్శంగా తీసుకునేలా మార్గదర్శనం వహించాలి.
- ప్రజాప్రతినిధులంతా ఒకే బడిలో కాకుండా, ఆయా గ్రామాల పరిధిలోని పాఠశాలల్లో పాల్గొనడంతో అన్ని స్కూళ్లలో ఈ కార్యక్రమం విజయవంతమై లక్ష్యం నెరవేరుతుంది.
- పిల్లల చదువు మెరుగుపడటానికి, పాఠశాల అభివృద్ధికి మీ సూచనలు, సలహాలు, సహకారం తెలియజేసేలా ప్రసంగాలు ఉండాలి.
- పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలపడం సందర్భోచితం.
- రాజకీయ పార్టీలు, వివిధ భావజాలాలకు సంబంధించిన కండువాలు, దుస్తులు, టోపీలు ధరించి సమావేశానికి రాకూడదు.
- మంత్రి వస్తున్నారని, ఎమ్మెల్యే వస్తున్నారని అంతా ఒకే బడి సమావేశానికి వెళ్లకూడదు.
- రాజకీయపార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, వ్యక్తుల ఫొటోలు, స్వాగతాలు ప్రదర్శించకూడదు.
- తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఆహ్వానితులు కాకుండా ఇతరులు సమావేశాల్లో ప్రవేశానికి అనుమతి లేదు.



సమావేశాలకు ఏర్పాటు చేసిన బ్యానర్


పకడ్బందీగా నిర్వహించేలా..



జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ నెల 7వ తేదీన పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరుగుతోంది. సమాజ భాగస్వామ్యం ఉన్నప్పుడే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుంది. నేటి విద్యారంగంలో అనేక మార్పులు వస్తున్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల మధ్య సంబంధాలను బలపరచడంతో ప్రభుత్వ స్కూళ్లు మరింత అభివృద్ధి చెందుతాయి.

– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు


ప్రతి పాఠశాలలో సమావేశం



జిల్లా వ్యాప్తంగా 2,444 స్కూళ్లలో మెగా పీటీఎం నిర్వహించబోతున్నాం. ఇప్పటికే ఎంఈఓల ఖాతాల్లో నిధులు జమచేయడం జరిగింది. ఇప్పటి వరకూ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులకే ఈ కార్డులు అందేవి. ఇకపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హోలిస్టిక్ కార్డులు అందించనున్నాం. టీచర్లు, పిల్లల తల్లిదండ్రులకు పిల్లల చదువుపై జవాబుదారీతనం పెంచడమే ఈ కార్యక్రమం వెనుక ఉన్న ముఖ్య ధ్యేయం.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు జిల్లా

కీలకమైన కార్యక్రమం



జిల్లాలో ఈ నెల 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) కీలకమైన కార్యక్రమం. తల్లిదండ్రులు కచ్చితంగా హాజరయ్యేలా హెచ్ఎంలు చర్యలు చేపట్టాలి. తల్లిదండ్రులు తమ పిల్లలు విద్యాపరంగా, ప్రవర్తనా పరంగా ఏ స్థాయిలో ఉన్నారో తెలుసుకోవచ్చు. సమాజ అంశాలపై ఎలాంటి అవగాహన కలిగి ఉన్నారో పరిశీలించవచ్చు. ఈ సమావేశం అనంతరం చర్చించే అంశాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తాం.

– వి.వెంకటరమణారెడ్డి, ఏపీసీ, సమగ్రశిక్షశాఖ, చిత్తూరు జిల్లా

క్లుప్తంగా

జాతీయ స్థాయి క్రీడాకారులకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ సురేష్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్‌శాఖ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను శుక్రవారం ఎస్‌ఈ కార్యాలయంలో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ అభినందించారు. వివరాలను విశ్రాంత ఉద్యోగి, కోచ్ పీసీ బాబు, రూరల్ ఈఈ సురేష్ వెల్లడించారు. ఇటీవల విజయనగరంలో జరిగిన విద్యుత్ శాఖ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో అథ్లెటిక్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఉమ్మడి జిల్లా 46 పాయింట్స్ సాధించిందన్నారు. నగరి జేఎల్‌ఎం–2 బాలాజీ లాంగ్‌జంప్, ట్రిపుల్‌హై జంప్‌లో, అరగొండ ఎల్‌ఐ రవి జవాలింగ్‌లో, సంతపేట జేఎల్‌ఎం –2 కుమార్ డిస్కస్, షార్ట్‌పుట్, అరగొండ జేఎల్ ఎం–2 హరి, జీడీనెల్లూరు ఎల్‌ఎం భాస్కర్‌రెడ్డి రన్నింగ్‌రేసులో ఉత్తమ ప్రతిభ చూపించారని చెప్పారు. వీరిని మర్యాద పూర్వకంగా ఎస్‌ఈని సన్మానించారని వివరించారు. కార్యక్రమంలో డీఈలు ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ లేని వాహనాలపై కేసులు



పుంగనూరులో స్కూల్ బస్సు రికార్డులను పరిశీలిస్తున్న ఎంవీఐ సుప్రియ

పుంగనూరు : నిబంధనలకు విరుద్ధంగా ఇన్సూరెన్స్ చెల్లించకుండా నడుపుతున్న వాహనాలపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించినట్లు ఎంవీఐ సుప్రియ తెలిపారు. పలమనేరు, చిత్తూరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. రెండు స్కూల్ బస్సులకు ఇన్సూరెన్స్‌లు లేకపోవడంతో కేసులు నమోదు చేశామన్నారు. ఆటోల సహా ఇతర 9 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.53 వేలు జరిమానా విధించామన్నారు. వాహన యజమానులు తప్పకుండా బీమా, పర్మిట్, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్లు ఉండాలన్నారు. డ్రైవర్లు విధిగా లైసెన్సులు పొంది ఉండాలన్నారు. రికార్డులు లేని వాహనాలను రహదారులపై నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వాహనాలపై కేసులు నమోదు చేయడమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తామని ఎంవీఐ హెచ్చరించారు.

బాబు ఇలాకా.. అక్రమాలు పక్కా

- ప్రభుత్వ భూమికి నకిలీ పట్టా
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వెలుగుచూసిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్



గుడుపల్లె తహసీల్దార్ కార్యాలయం

గుడుపల్లె: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత గ్రానైట్, తమిళ బియ్యం, గంజాయి, కృత్రిమ ఇసుక వంటి అక్రమాలు ఎక్కువయ్యాయి. దీనికి తోడుగా మరో కుంభకోణం బయటపడింది. చంద్రబాబు తన గుండెకాయ అని చెప్పుకునే గుడుపల్లె మండలంలో మరో అవినీతి భాగోతం వెలుగులోకి వచ్చింది. అక్రమార్కులు ఏకంగా ప్రభుత్వ భూమినే పట్టాదారు పాస్తుకం, పట్టాలను సృష్టించారు. కోటచెంబగిరి గ్రామానికి చెందిన జగదీష్ నలగాంపల్లె గ్రామ రెవెన్యూకు చెందిన సర్వే నెంబరు 1–3లో విస్తీర్ణం 1.10 ఎకరాలు, 1–3లో 1.30 ఎకరాలు ప్రభుత్వం భూమి, సిరిగిరిపల్లె రెవెన్యూకు చెందిన సర్వే నెంబరు 33ఏలో విస్తీర్ణం 2.25 ఎకరాలు పశువుల మేత భూమి, కనమనపల్లె గ్రామ రెవెన్యూకు చెందిన సర్వే నెంబరు 184–7లో విస్తీర్ణం 1.31 ఎకరాలు , 182–3 సర్వే నెంబరులో విస్తీర్ణం 0.22 ఎకరాలు, సర్వేనెంబరు182–3లో విస్తీర్ణం 0.11 ఎకరాల ప్రభుత్వ భూములు ఏకంగా రాజముద్రలతో పట్టాదారు పాసుపుస్తకాలు తయారు చేశాడు. ఈ భూములను కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్న కొంత మంది ఆయా గ్రామాలకు చెందిన అమాయకులను ఎంపిక చేసుకున్నాడు. వీరి నుంచి లక్షలకు లక్షలు కాజేసి ఈ నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలను వారి పేరిట సృష్టించాడు. ఇకపై నుంచి ఈ భూములు నీ ఆధీనంలో ఉంటాయని నమ్మబలికి చేతులు దులుపుకున్నాడు. గ్రామస్తులు సొంత భూమి కల నెరవేరిందని సంతోషంలో పడ్డారు. నకిలీ పట్టాదారు పుస్తకాలు తీసుకుని నిరుపేదలు ఈ భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించుకునేందుకు కొంత కాలంగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

ప్రజా వేదికలో బయటపడ్డ మోసం

నిరుపేదలు తమ భూములు ఆన్‌లైన్‌లో పెట్టుకునేందుకు ఎన్నిమార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని కుప్పం ఆర్డీవో శ్రీనివాసురాజును ఆదేశించారు. ఆర్డీవో దీనిపై విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ సీతారాంకు సూచించారు. తహసీల్దార్ విచారణలో జగదీష్ గ్రామస్తులను మోసం చేసినట్లు విచారణలో తెలింది. దీంతో జగదీష్‌పై శుక్రవారం సాయంత్రం గుడుపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రామకుప్పంలో నకిలీ ధ్రువపత్రాలు వాస్తవమే : ఆర్డీఓ

కుప్పం: రామకుప్పంలో నకిలీ ధృవపత్రాల సృష్టించడం వాస్తవమేనని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం కుప్పంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రామకుప్పం మండల పరిధిలో నకిలీ జనన ధృవపత్రాలు అడ్డదారిలో మంజూరవుతున్నాయన్న ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. వీర్నమల గ్రామంలో బాలానాయక్ నడుపుతున్న కమ్యూనిటీ సెంటర్‌ను తనిఖీ చేశారు. బాలానాయక్ మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తితో వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉన్నాడు. అతని ద్వారా ఒక వెబ్ పోర్టల్(డాష్ బోర్డ్‌బర్త్.ఇన్.నెట్) యాక్సిస్ తీసుకున్నాడు. ఈ వెబ్‌సైట్ ద్వారా నకిలీ జనన ధృవపత్రాలను డౌన్‌లోడ్ చేసేవారు. ఈ సైట్‌లో ఎవరి వివరాలు ఇచ్చినా సరే అది ఎటువంటివి తనిఖీ చేయకుండా జనన ధ్రువపత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కృష్ణాజిల్లాలోని జగ్గయ్యపేట మున్సిపాలిటీ, అనంతపురం జిల్లా కమలపాడు గ్రామ సచివాలయం డిజిటల్ సంతకాలతో ధృవీకరణపత్రాలు వస్తున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన వాలెట్‌లో రూ.200 చెల్లిస్తే నకిలీ సర్టిఫికెట్స్ డౌన్‌లోడ్ అవుతాయి. అనంతరం బాలానాయక్ ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి అందించి వారి నుంచి అధిక మొత్తంలో నగదు వసూలు చేసేవాడు. రామకుప్పంలోని లీలాద్య ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వాహకుడు నవీన్ ఎవరికైతే జనన ధృవపత్రాలు అవసరమో అటువంటి వారి నుంచి వివరాలను తీసుకునేవాడు. ముద్దనపల్లి మీసేవా నిర్వాహకుడు అక్రమ్, మీసేవా భాస్కర్ నుంచి నవీన్ డేటాను తీసుకున్నాడు. సేకరించిన డేటాను మహేష్ అనే అతనికి పంపించేవాడు. దీంతో మహేష్ నకిలీ జనన ధృవపత్రాలను ఇచ్చేవాడు. ఈ నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం నవంబర్ 10వ తేదీ నుంచి ప్రారంభమైనట్లు ఆర్డీఓ తెలిపారు. మహేష్ రాళ్ళబూదుగూరు, రామకుప్పం, కర్లగడ్డ పంచాయతీ కార్యదర్శుల లాగిన్‌ను ఉపయోగించి నకిలీ జనన ధ్రువపత్రాలను డౌన్‌లోడ్ చేసి నవీన్‌కు ఇచ్చేవాడు. నవీన్ లబ్ధిదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసేవాడు. పలమనేరు, గుర్రంకొండ, బైరెడ్డిపల్లి ప్రజలకు కూడా నకిలీ జనన ధ్రువపత్రాలను నవీన్ ఇచ్చినట్టు విచారణలో తేలినట్టు ఆర్డీఓ తెలిపారు. సుమారు 500 నుండి 1000 నకిలీ జనన ధ్రువపత్రాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. లక్షల్లో చేతులు మారినట్టు తెలిపారు. నకిలీ ధ్రువపత్రాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. నిర్వాహకుల సెంటర్లను సీజ్ చేశామన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో కీలకంగా ఉన్న నవీన్, అతని సహచరులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ శ్రీనివాసరాజు స్పష్టం చేశారు.

తోటల్లోనే వదిలేసిన బొప్పాయి



చీలంపల్లి వద్ద తోటలో వదిలేసిన బొప్పాయి

పలమనేరు : నియోజకవర్గంలోని వందల ఎకరాల్లో రబీలో సాగైన బొప్పాయికి ఆశించిన ధరలు లేక కొనేవాళ్లు లేక రైతులు పండించిన పంటను పొలాల్లోనే వదిలిపెట్టారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని ఈ విడత రైతులు పంటకోసం పెట్టిన పెట్టుబడి దక్కలేదని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆ మేరకు బైరెడ్డిపల్లె మండలం చీలంపల్లి వద్ద రెడ్డెప్ప రెడ్డి తన పొలంలోని బొప్పాయిని పక్షులు, వానరాల కోసం వదిలేశారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

నగరి : గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని నెత్తం కండ్రిగ వద్ద చోటుచేసుకుంది. ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం మట్టిరోడ్డు వద్ద కాపుకాసిన పోలీసులు గంజాయి సరఫరా చేస్తున్న తిరుత్తణికి చెందిన రాజేంద్రప్రసాద్ (25), నగరి మండలం ఓజీ కుప్పం గ్రామానికి చెందిన సతీష్ (33), తులసీందర్ (32)ను డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 1500 గ్రాముల గంజాయి, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం నగరి జూనియర్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులను డీఎస్పీ, ఎస్పీ అభినందించారు.

హోంగార్డుల సేవలు మరువలేం



ర్యాలీగా వెళుతున్న హోంగార్డులు

చిత్తూరు అర్బన్: ఒక్కోసారి పోలీసులకంటే హోంగార్డులు కష్టపడి పనిచేసే తీరు చూస్తుంటే.. వాళ్ల కష్టాన్ని ఎవరితోనూ పోల్చడం సాధ్యంకాదని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని చిత్తూరు నగరంలోని ఆర్మ్‌డు రిజర్వు పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత హోంగార్డులు కవాతు నిర్వహించగా, మహిళా హోంగార్డు చరిష్మా దీనికి నాయకత్వం వహించారు. పోలీసులకు ఏమాత్రం తీసిపోకుండా నిర్వహించిన కవాతును ఎస్పీ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోలీసులతో కలిసి శాంతి భద్రతల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రముఖుల పర్యటనల్లో బందోబస్తు, ప్రకృతి వైపరీత్యాలతో పాటు బాధ్యతాయుతమైన పనులను హోంగార్డులు నికచ్చిగా నిర్వర్తిస్తున్నారని అభినందించారు. జిల్లాలో ఎవరైనా హోంగార్డు ప్రమాదంలో గాయపడితే రూ.30 వేలు, ఉద్యోగ విరమణ చేస్తే రూ.4 లక్షలు, మరణిస్తే రూ.4 లక్షలు ఇచ్చి ఆదుకుంటున్నట్లు వివరించారు. అనంతరం ఇటీవల హోంగార్డులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు ఎస్పీ బహుమతలను అందజేశారు. హోంగార్డులు ర్యాలీ నిర్వహించారు. ఏఎస్పీ ఆర్.రాజశేఖర్ రాజు, హోంగార్డు ఆర్‌ఐ చంద్రశేఖర్, ఎస్‌బి సీఐ భాస్కర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.27 లక్షలు హాంఫట్!

- అడవిలో చెట్లు కొట్టి పరిహారాన్ని మింగిన అటవీశాఖ!
- ఎక్స్‌ప్రెస్‌హైవే వెళ్లే మార్గంలో దందా
- డీఈటీ వర్క్ పేరిట స్వాహా చేసిన పూర్వపు ఎఫ్ఆర్వో
- దీనిపై కూపీ లాగుతున్న ఉన్నతాధికారులు



వృక్షాలను మాయం చేసి నిర్మించిన రోడ్డు

పలమనేరు: అటవీశాఖే కదా.. మనల్ని ఎవరు అడుగుతారులే..అనుకున్నారేమో. ఎక్స్‌ప్రెస్ హైవే మార్గంలో అడ్డుగా ఉన్న అటవీ వృక్షాలను నరికి సంబంధిత పరిహారం రూ.27 లక్షలను చెల్లించారు. ఈ మొత్తాన్ని సంబంధిత శాఖకు చెల్లించకుండానే ఓ ఫారెస్ట్ అధికారి దిగమింగేశారు. దీనిపై జిల్లా ఫారెస్ట్ అధికారిణి, మరోవైపు ఇంటెలిజెన్స్ వర్గాలు రహస్య విచారణ చేస్తున్నట్టు సమాచారం.

నష్టపరిహారం ఇవ్వకనే..

కర్ణాటకలోని హొస్‌కోట నుంచి తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ దాకా ఎక్స్‌ప్రెస్‌హైవే రోడ్డు పనులు సాగుతున్నాయి. ఈ రోడ్డు పలమనేరు మండలంలోని కౌండిన్య అడవిలో మొగిలి ఘాట్‌కు ఆనుకొని వెళ్తోంది. రోడ్డు నిర్మాణం కోసం హైవే వాళ్లు అడవిలోని రోడ్డు మార్గంలోని చెట్లను తొలగించాల్సి వచ్చింది. ఇందుకోసం ఫారెస్ట్ శాఖకు అక్కడున్న వృక్షాలను విలువకట్టి రూ.27 లక్షలుగా నిర్ణయించి ఆ మొత్తాన్ని స్థానిక ఫారెస్ట్ అధికారులకు అందించారు. అయితే ఈ పనులనుకు సంబంధించి గతంలో ఇక్కడ పనిచేసిన ఎఫ్ఆర్వో శివన్న డిపార్ట్‌మెంటల్ ఎక్స్‌ట్రాక్షన్ పనుల పేరిట చేయించి ఆ డబ్బును స్వాహా చేసినట్టు తెలిసింది. అప్పట్లోనే స్థానిక ఫారెస్ట్ సిబ్బంది దీనిపై వ్యతిరేకించారు. ఇది డిపార్ట్‌మెంటల్ ఎక్స్‌ట్రాక్షన్ పనులుగా ఉన్నందున ఆ ఫైల్‌లో సంబంధిత ఎఫ్ఎస్వో, ఎఫ్‌బీవోలు సైతం సంతకాలు చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ జరిగిన అక్రమాలను గ్రహించిన వారు తాము సంతకాలు చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కానీ ఈ ఫైల్ ఎలా ముందుకెళ్లిందో అర్థం కాలేదు.

ఆడిట్ వెలుగులోకి

ఫారెస్ట్ శాఖకు సంబంధించిన ఆడిట్‌లో ఈ విషయాన్ని ఆడిటర్లు తెలుసుకున్నారు. ఉన్నతాధికారులు దీనిపై డిపార్ట్‌మెంటల్ విచారణ సైతం చేస్తున్నట్టు తెలిసింది. గతంలో ఇక్కడ ఎఫ్ఆర్వోగా పనిచేసిన శివన్న బదిలీపై ఇప్పుడు సోషల్‌ఫారెస్ట్ ఎఫ్ఆర్వోగా వైఎస్సార్ జిల్లా, రాజంపేట రేంజ్‌లో ఉన్నారు. ప్రస్తుతం పలమనేరు ఎఫ్ఆర్వోగా నారాయణ విధుల్లో ఉన్నారు. ఈ విషయమై సాక్షి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఎవర్నీ వదిలిపెట్టం

పలమనేరు కౌండిన్య ఫారెస్ట్‌లో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా చెట్లను కొట్టి వాటిని అమ్ముకొని, ఎక్స్‌ప్రెస్ హైవే వారినుంచి నష్టపరిహారాన్ని పొంది దాన్ని తమశాఖకు అప్పగించకుండా అక్రమాలు జరిగిన మాట నిజమే. దీనిపై తాము ఇప్పటికే విచారణ జరిపిస్తున్నాం.అక్రమాలు చేసిన వారిపై వేటు తప్పదు.

- భరణి, డీఎఫ్‌వో, చిత్తూరు వెస్ట్

కార్లదొంగ జోయెల్ అరెస్ట్


- రూ.60 లక్షల విలువైన 11కార్లు స్వాధీనం
- నిందితున్ని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపిన పోలీసులు



కార్లదొంగను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పలమనేరు: యజమానులకు మస్కాకొట్టిన కార్లదొంగ జోయెల్‌ను పలమనేరు పోలీసులు శుక్రవారం నాగమంగళం వద్ద అరెస్ట్ చేసి అతని నుంచి రూ.60లక్షల విలువైన 11 కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ గంగవరం పీఎస్ వద్ద విలేఖరులకు వివరించారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన లూకయ్య కుమారుడు సుబ్బన్న జోయెల్(24) అద్దెకార్లకు యాక్టింగ్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. దీంతో పట్టణంలోని పలువురు కార్ల యజమానులతో నమ్మకాన్ని పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో యజమానులు ఇచ్చిన కార్ల రెండో తాళం చెవిని తన వద్దే ఉంచుకొనేవాడు. ఈ కార్లను ఎక్కడ పెడతారో కూడా తెలుసుకున్నాడు. జల్సాలకు అలవాటు పడిన ఇతను యజమానులకు సరిగ్గా అద్దెలివ్వకుండా, కార్లను చూపకుండా మాయం చేశాడు. దీంతో పలువురు కార్ల యజమానులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ మణికంట చందోలు ఆదేశాలతో స్థానిక డీఎస్పీ ప్రభాకర్ ఓ ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. జోయెల్ 5 కార్లను కొందరికి తనఖాపెట్టి డబ్బులు తీసుకోగా మిగిలిన కార్లను తన వద్దనున్న రెండో తాళం చెవితో చోరీ చేసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో అమ్మేసినట్టు పోలీసుల విచారణలో బయటపడింది. దీంతో జరిగిన చోరీలపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇతన్ని నాగమంగళం ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరళించారు. ఈ కేసును ఛేదించడంతో చొరవచూపిన పలమనేరు సీఐ నరసింహరాజు, ఐడీ పార్టీ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. కార్ల యజమానులు ఎవరికి పడితే వారికి కార్లను ఇవ్వరాదని సూచించారు. .

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

రామకుప్పం: రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మండలంలోని గొరివిమాకులపల్లెలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ సుమిత్ కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 8వ తేదీ వరకు 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సుల్లో ఫ్రీ హోల్డ్, మ్యుటేషన్, 22ఏ, డీకేటీ, రీ సర్వే, ఇతర భూ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలు కోర్టుల ద్వారా మాత్రమే పరిష్కారం అవుతాయన్నారు. భూ యజమానుల వద్ద ఉన్న పత్రాల ఆధారంగా న్యాయపరమైన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సచివాలయంలో విలేజ్ అసిస్టెంట్, వీఆర్‌ఓల ద్వారా తమ భూమికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకోవచ్చని చెప్పారు. కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ సదస్సుల్లో భూ యజమానులకు వారి భూమిపై హక్కు కల్పించి భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్ మునిరత్నం, తహసీల్దార్ బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పాల్గొన్నారు.

నమ్మకం లేక.. హాజరవ్వక!

- ప్రజల్లేక వెలవెలబోయిన రెవెన్యూ గ్రామ సభలు
- జిల్లాలోని 32 మండలాలకు గాను 31 మండలాల్లో నిర్వహణ
- సమస్యలు పరిష్కరిస్తారన్న నమ్మకం లేదంటున్న ప్రజలు
- తొలిరోజు 1087 అర్జీలకు గాను 2 అర్జీలు పరిష్కారం



జగమర్ల గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రజలు లేక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం జిల్లాలో ఆర్భాటంగా శుక్రవారం ప్రారంభించిన రెవెన్యూ గ్రామ సభలు ప్రజల్లేక వెలవెలబోయాయి. జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లో గ్రామ సభలు నిర్వహించాల్సి ఉండగా 31 మండలాల్లో మాత్రం నిర్వహించారు. పాలసముద్రం మండలంలో పలు కారణాలతో రెవెన్యూ గ్రామ సభలు మొదటి రోజు నిర్వహించలేకపోయారు. మరి కొన్ని గ్రామాల్లో ఉదయం ఆలస్యంగా ప్రారంభించడంతో ప్రజలు పడిగాపులు గాశారు. మరి కొన్ని ప్రాంతాల్లో రెవెన్యూ గ్రామ సభలు తమ గ్రామంలో నిర్వహిస్తారన్న విషయమే తెలియదని గ్రామస్తులు వాపోయారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలకు మొదటి రోజు 1,087 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో రెండు అర్జీలు మాత్రం మొదటి రోజు పరిష్కరించారు. మిగిలిన 1,085 అర్జీలు పరిష్కరించాల్సి ఉంది. భూ ఆక్రమణలు, 22 ఏ రికార్డుల విషయంలో అవకతవకలకు సంబంధించి అధికంగా అర్జీలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పరిష్కారంపై నమ్మకం లేక..

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని పలు మార్లు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగితేనే అధికారులు పట్టించుకోరని, ప్రస్తుతం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో సర్టిఫికెట్ కావాలన్నా ముడుపులు ఇవ్వాల్సిందేనని చెబుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తమ ఆర్భాటం కోసం మాత్రమే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నారని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో వినతులు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కావని భావించిన ప్రజలు తగిన సంఖ్యలో హాజరుకాలేదు.

సంక్షేమ పథకాల ఆశ చూపించి..

జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలకు సంక్షేమ పథకాల ఆశ చూపి ప్రజలను తరలించారు. రెవెన్యూ గ్రామ సభల్లో ప్రజలు లేకపోతే అవమానం జరుగుతుందని భావించిన కూటమి ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాల పేరును వాడుకున్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 6 నెలలు కావస్తున్నా మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయలేని దుస్థితి. జిల్లాలోని కుప్పం , పుంగనూరు, పలమనేరు, నగరి నియోజకవర్గాల్లో సంక్షేమ పథకాల మంజూరు ఆశ చూపి ప్రజలను తరలించినట్లు తెలిసింది. చివరకు గ్రామ సభలకు హాజరైన ప్రజలు అక్కడ జరిగిన తంతును చూసి గ్రామ సభల వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని వెనుదిరిగారు.

ఇచ్చిన అర్జీలకు మోక్షమేది?


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు మార్లు అర్జీలు ఇచ్చినా, వాటికీ ఇప్పటికీ పరిష్కారం చూపలేదని ప్రజలు వాపోతున్నారు. ఆ అర్జీలకు పరిష్కరించకుండా ఇప్పుడు రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించి లాభమేమీ లేదంటున్నారు. రెవెన్యూ గ్రామ సభల వల్ల వ్యయ ప్రయాసలు తప్ప ఎలాంటి ఉపయోగం లేదని ప్రజలు వెల్లడిస్తున్నారు. కూటమి సర్కారుకు చిత్త శుద్ధి ఉంటే ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేసి, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. నగరి నియోజకవర్గం మాంగాడు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో గ్రామకంఠానికి ఇచ్చే సర్టిఫికెట్ మంజూరు విషయంలో రెవెన్యూ అధికారులు ఒక విధంగా, రిజిస్ట్రార్ ఆఫీస్‌లో మరొక విధంగా రూల్స్ చెబుతున్నారని గ్రామస్తులు ప్రశ్నించారు. గ్రామకంఠం సర్టిఫికెట్‌లో వీఆర్‌వో సంతకం చేస్తే సరిపోతుందని కలెక్టర్ చెబుతున్నారని, అయితే రిజిస్టర్ కార్యాలయాల్లో ఆర్ఐ, తహసీల్దార్ సంతకం చేయాల్సిందేనని ఇబ్బందులు పెడుతున్నట్లు ప్రజలు వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు.

బొమ్మసముద్రానికి జాతీయ అవార్డు

ఐరాల: చిత్తూరు నియోజకవర్గం, ఐరాల మండలంలోని బొమ్మసముద్రం పంచాయతీ జాతీయ స్థాయిలో మెరిసింది. గ్రామ పంచాయతీకి శుక్రవారం అవార్డులు ప్రకటించగా, ఆరోగ్య పంచాయతీ(హెల్తీ పంచాయతీ) విభాగంలో బొమ్మసముద్రం జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా నిలిచింది. జాతీయ స్థాయి గ్రామ పంచాయతీలకు ఈ నెల 11న ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేయనున్నారు. బొమ్మసముద్రానికి అవార్డుతోపాటు రూ.కోటి నగదు పురస్కారాన్ని అందించనున్నారు.

సెప్టెంబర్‌లో దరఖాస్తు

జాతీయస్థాయి అవార్డుల్లో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ పురస్కారాలకు తొమ్మిది విభాగాల్లో పనితీరును పరిశీలించారు. బొమ్మసముద్రం గ్రామ పంచాయతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామంలో అందుతున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్య విషయాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మాతా శిశు మరణాలను నివారించడంలో 100 శాతం లక్ష్యాలను సాధించారు. జాతీయ స్థాయి అవార్డుకు నామినేట్ చేయగా దేశంలో ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా మొదటి స్థానం దక్కించుకుంది. ఉత్తమ పంచాయతీగా జాతీయస్థాయిలో నిలిపిన బొమ్మసముద్రం సర్పంచ్ రఘు, వార్డు సభ్యులు, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి మోనిక, పాలకవర్గ సభ్యులను, మండల అధికారులు, ఎంపీడీఓ ధనలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయిలో బొమ్మసముద్రం అవార్డును దక్కించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది అందరి కృషి వల్లనే సాధ్యమైందని సర్పంచ్ రఘు తెలిపారు.



బొమ్మసముద్రం గ్రామం